

నేషనల్ హైవే పనులకు డీఎంఎఫ్‌టీ నిధులు



రూ. 22 కోట్లు వెచ్చించిన జాతీయ రహదారి

- క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో దుర్వినియోగం
- రూ.22 కోట్లు అప్పనంగా కేటాయించిన యంత్రాంగం
- అప్పటికే నిధులు మంజూరై పనులు ప్రారంభం
- సింగరేణి ఏరియాల్లో నిధుల కొరతతో కుంటుపడ్డ అభివృద్ధి
- విచారణ చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

మంచిర్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణానికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు కేటాయించిన ఉదంతం జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. డీఎంఎఫ్‌టీ నిధులను భూగర్భ గనులు, అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉండగా, అప్పటికే మంజూరై పనులు ప్రారంభించిన నేషనల్ హైవే రోడ్డు వెడల్పు, తదితర పనులకు కేటాయించడం గమనార్హం. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గిన జిల్లా అధికార యంత్రాంగం వారు అడిగిందే తడవుగా కోట్ల రూపాయలను అప్పనంగా కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో...

చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.22 కోట్లు దుర్వినియోగమయ్యాయి. స్వయంగా కలెక్టరే డీఎంఎఫ్‌టీ నిధులను జాతీయ రహదారికి కేటాయిస్తూ ఆర్డర్ జారీ చేయడం కొసమెరుపు. ప్రభుత్వ అనుమతితో డీఎంఎఫ్‌టీ నిధులను పలు రకాల అభివృద్ధి పనులకు కేటాయించే విస్తృత అధికారాలు కలెక్టర్‌కు ఉన్నప్పటికీ, జాతీయ రహదారి నిర్మాణ పనులకు కేటాయించడం విమర్శలకు దారితీస్తోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి మంచిర్యాల మీదుగా ఎన్‌హెచ్-363 నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ పనులను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) పర్యవేక్షిస్తోంది. రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు కూడా ఆ సంస్థ ఆధ్వర్యంలోనే కేటాయిస్తారు.

తాండూరు మండలం రేపల్లేవాడ నుంచి మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ వరకు రహదారి వెడల్పు, ఇతరత్రా పనులు ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచి జిల్లా కేంద్రాన్ని అనుసంధానం చేసేలా నాలుగు వరుసల రహదారి పనుల నిర్మాణం ప్రారంభమైంది. ప్రస్తుతం ఆ పనులు సుమారు 2.8 కిలోమీటర్ల మేర చేపట్టేందుకు రూ.22 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. అయితే 2.8 కిలోమీటర్ల మేర పనులకు ఎన్‌హెచ్‌ఏఐ నిధులు వినియోగించనందునే తాము కేటాయించాల్సి వస్తోందని అధికారులు పేర్కొనడం గమనార్హం. తాండూరు మండలం నుంచి మంచిర్యాల వరకు 42 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి ప నులకు నిధులు కేటాయించిన ఎన్‌హెచ్‌ఏఐ కేవ లం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస గార్డెన్స్ నుంచి క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వరకు 2.8 కిలోమీటర్ల మేర కేటాయించక పోవడంలో అంతరార్థ మేమిటో అంతు చిక్కకుండా ఉంది.

సింగరేణి ఏరియాల్లో కుంటుపడ్డ అభివృద్ధి

డీఎంఎఫ్‌టీ ఫండ్ ఉందని ఇష్టారీతిన ఖర్చు చేస్తున్న అధికారులకు సింగరేణి ఏరియాల్లో నెలకొన్న సమస్యలు కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భూగర్భ గనులు, కోల్‌మైన్స్ ప్రభావిత ప్రాం తాల్లో పెద్దగా అభివృద్ధికి ఆస్కారం ఉండదు. ఆ ఏరియాల్లో వివిధ అభి వృద్ధి పనులు చేపట్టే ఉద్దేశ్యంతో ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులు ఉపయోగించే వెసలుబాటు కల్పించింది. దానికి భిన్నంగా డీఎంఎఫ్‌టీ నిధులను ఇష్టారీతిన ఇతర పనులకు కేటాయించడం గమనార్హం. సింగరేణి ప్రాంతంలోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో అభివృద్ధి కుంటుపడ్డప్పటికీ నిధులు కేటాయించకుండా జాతీయ రహదారికి వెచ్చించడం విమర్శలకు దారి తీస్తోంది.

విచారణ చేపట్టాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు...

డీఎంఎఫ్‌టీ నిధులను జాతీయ రహదారికి కేటాయించడంపై విచారణ జరపాలంటూ మంచిర్యాలకు చెందిన స్వచ్ఛంద పౌర సేవా సంస్థ కార్యదర్శి తులా మధుసూధన్‌రావు గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్‌హెచ్-363 నిర్మాణ పనులకు ఆ సంస్థ నిధులు విడుదల చేస్తుండగా, డీఎంఎఫ్‌టీ నిధులను కేటాయించడాన్ని ఆయన ప్రశ్నించారు. నేషనల్ హైవే పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, ప్రత్యే కంగా రూ.22 కోట్లు వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చిందని, దీనిపై వెంటనే పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి



అవగాహన కల్పిస్తున్న జాతీయ విపత్తు నివారణ సభ్యులు

ఏసీసీ, జనవరి 25 : విపత్తులు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని జాతీయ విపత్తుల ప్రతి స్పందన దళం విజయవాడ 10వ బెటాలియన్ కమాండెంట్ బీటెన్‌సింగ్ అన్నారు. గురువారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విపత్తులు రెండు రకాలని మానవ తప్పిదాల వల్ల, సహజ విపత్తులు అని తెలిపారు. విపత్తులు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, వరదలు, భూకంపం, అగ్ని ప్రమాదాలు, గుండెపోటు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. హెడ్మాస్టర్ పద్మావతి, విద్యాశాఖ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఎంఈవో పోచయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న గోనె ప్రకాష్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 25: మంచిర్యాల-అంతర్గాం మధ్య గోదావరి నదిపై నిర్మించే వంతెన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల-అంతర్గాం మధ్య బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వంతో పోరాడామన్నారు. దీంతో రూ.1.64 కోట్లు విడుదల చేసిందన్నారు. నాలుగేళ్ళుగా బ్రిడ్జి పనులు వాయిదా పడుతున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నదిపై వంతెన నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వంతెన సాధన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బెల్లంపల్లి, జనవరి 25: వ్యవసాయ ఉద్యానవర్శిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని, జీవో నెంబరు 55ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ గురువారం ఏబీవీపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన వర్శిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని నెల రోజులుగా యూనివర్శిటీ వద్ద ఏబీవీపీ నాయకులు నిరసనలు చేస్తుంటే పోలీసులు జుట్టు పట్టుకుని లాగుతూ తీసుకువెళ్లడం అమానుషమన్నారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గూడెంలో భక్తుల రద్దీ



వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, జనవరి 25: పౌర్ణమి పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ఉదయం గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులందరికి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబైన బాలుర ఉన్నత పాఠశాల మైదానం





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాములు, అధికారులు, దుకాణాల వద్ద అమ్మకానికి జాతీయ జెండాలు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 25: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో గణతంత్ర వేడుకలకు గురువారం ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ బదావత్ సంతోష్ జెండావిష్కరిస్తారు. మంచిర్యాల ఆర్డీవో రాములు, తహసీల్దార్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్టాళ్లు, పోలీసు కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు మైదానాన్ని తీర్చిదిద్దారు. బెల్లంపల్లి ఏసీపీ మల్లికార్జున్, కమాండెంట్ వామన్‌రావుల ఆధ్వర్యంలో పోలీసు కవాతు రిహార్సల్స్ నిర్వహించారు.

జిల్లా కేంద్రంలోని జనరల్ స్టోర్‌లు, దుకాణాల వద్ద ప్రజలు జాతీయ జెండాలను కొనుగోలు చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డు, రాంనగర్, రెడ్డి కాలనీ ప్రాంతాల్లోని దుకాణాల వద్ద జెండాల కొనుగోళ్లతో సందడి నెలకొంది.

కార్యక్రమ వివరాలు

బాలుర పాఠశాల మైదానంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం జాతీయ జెండా ఎగురవేస్తారు. ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ, 9.02 వందన స్వీకారం, 9.10 సందేశం, 9.35 గంటలకు శకటాల ప్రదర్శన, 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.30 వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి బహుమతుల ప్రదానం. 11.30 గంటలకు స్టాల్స్ సందర్శన ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పతాకాన్ని ఆవిష్కరించ నున్నారు.

దండేపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో ముస్తాబు చేస్తున్నారు. గురువారం జెండా పండుగ కోసం సిబ్బంది కార్యాలయాలను ముస్తాబు, పరిసరాలను శుభ్రం చేశారు.

ఎమ్మెల్సీగా కోదండరాంను నామినేట్ చేయడం హర్షణీయం

ఏసీసీ, జనవరి 25 : ప్రొఫెసర్ కోదండరాంను గవర్నర్ కోటా ద్వారా ఎమ్మెల్సీగా నామినేట్ చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్,నూరినేని గంగాధర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారన్నారు. కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ సాధారణ సమావేశం

చెన్నూరు, జనవరి 25: చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ అర్చనగిల్డా అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించిన కౌన్సిల్ సభ్యులు పనులను ఆమోదించారు. వైస్ చైర్మన్ నవాజుద్దీన్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఏఈ సాయికిరణ్, డాక్టర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

నస్పూర్, జనవరి 25 : బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలల్లో పెద్దపల్లి స్థానంను కైవసం చేసుకోవడానికి కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైనా పట్టణ అధ్యక్షుడు రమేష్‌ను నాయకులు సన్మానించారు. అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లికార్జున్, నాయకులు కమాలాకర్ రావు, సమ్రాజ్ రమేష్, కుర్ర చక్రవర్తి, రవణవేని శ్రీనివాస్, మిట్టపల్లి మొగిలి, సదనందం, తిరుపతి, శ్రీనివాస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది





ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు, బెల్లంపల్లిలో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 25: ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 14వ జాతీయ ఓటరు దినోత్సవాల్లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రితో కలిసి పాల్గొన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా వీడియో ద్వారా భారత ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్‌కుమార్ సందేశాన్ని అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1950 జనవరి 25న ఎన్నికల సంఘం స్థాపించబడిందన్నారు. ప్రపంచంలోనే మన దేశం పెద్ద ప్రజాస్వామ్యాన్ని కలిగి ఉందని, 96 కోట్ల మంది ఓటర్లకు 1.25 కోట్ల పోలింగ్ అధికారులు, 12 లక్షల పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో ఎక్కడా రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా జరిగాయని, ఇది ఎన్నికల సంఘం నిబద్దతతో కూడిన విజయమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరంఅధికారులు, విద్యార్థులు, సిబ్బంది చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

బెల్లంపల్లి: అర్హులైన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. తిలక్ స్టేడియం నుంచి కాంటా చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగం, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యంలో తమ వంతు పాత్ర పోషించాలని అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు అన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎవరైనా పేర్లు తప్పు ఉంటే బూత్ లెవల్‌లో సరి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీరాజం, విద్యార్థులు పాల్గొన్నారు.

జైపూర్: టేకుమట్లలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, సర్పంచు గోనె సుమలత, ఉపసర్పంచు నర్సయ్య, కార్యదర్శి శ్రావణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎంపీడీవో మల్లేషం, డిప్యూటీ తహసీల్దార్ విజయలు కోరారు. దండేపల్లిలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీటీసీ శ్రీనివాస్, ఆర్ఐ భూమన్న, చంద్రమౌళి, సర్పంచులు, నాయకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

హాజీపూర్: అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిజాయితీ గల నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పిస్తుందన్నారు. ఎంపీడీవో ఎంఏ హై, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో మల్లయ్య, డిప్యూటి తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో ఆలీం, అధికారులు ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు.

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌తో పాటు వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో ఓటరు అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

భీమిని: ఓటు హక్కు ప్రతీ పౌరుడి కనీస బాధ్యత అని తహసీల్దార్ బికర్ణదాస్ అన్నారు. డీటీ అంజయ్య, ఆర్ఐ వెంకటేష్, ఎంపీడీఓ జవహర్‌లాల్, కస్తూర్బా ఎస్ఓ కవిత, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్కిల్ కార్యాలయం వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రోహిత్ పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో సత్యనారాయణ, ఎంఈవో ప్రభాకర్, విద్యాభారతి విద్యాసంస్థల డైరెక్టర్ శరత్‌కుమార్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో తహసీల్దార్ విశ్వంబర్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయుడు విక్రమ్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాధాకిషన్, డిప్యూటీ తహసీల్దార్ గోవర్ధన్, ఆర్ఐ కిషన్‌రావు, కార్యదర్శి అభిలాష్, పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలిని సన్మానించిన సీఎం



ఏసీసీ, జనవరి 25: కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదులో మంచిర్యాల నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బూత్ లెవెల్ కన్వీనర్‌ల శిక్షణ శిబిరంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షిలు మెమోంటో అందించి సత్కరించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, జనవరి 25: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో వంద సీట్లకు, 7నుంచి 10వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 22 వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 125, జనరల్‌కు రూ. 200 ఉంటుందని, పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందన్నారు. మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఇక డిజిటల్ ఎక్స్‌రే సేవలు



ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే పరికరం

సిర్పూర్(టి), జనవరి 25: మండల కేంద్రంలోని 30పడకల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఇకనుంచి ఆర్థోపెడిక్ రోగులకు డిజిటల్‌సేవలు ప్రారంభం కానున్నాయి. 8నెలల క్రితం నుంచి పాత ఎక్స్‌రే పరికాలలో తరుచుగా ఇబ్బందులు తలెత్తుతుండడం, ఎక్స్‌రేఫిల్మ్‌ను ప్రభుత్వం సరఫరా చేయకపోవడం లాంటి ఉండేవి. వీటన్నింటిని గుర్తించిన రాష్ట్ర స్థాయి అధికారులు పాతవాటికి స్వస్తి

● తీరనున్న ఆర్థో రోగుల కష్టాలు

పలికి లక్షలరూపాయల నిలువచేసే నూతన డిజిటల్ ఎక్స్‌రేను సిర్పూర్(టి) ఆసుపత్రికి మంజూరు చేశారు. దీంతో ఆసుపత్రికివచ్చే ఆర్థోపెడిక్ రోగులకు డిజిటల్‌సేవలు అందనున్నాయి. ఈ డిజిటల్ ఎక్స్‌రే పరికరం ద్వారా రోగి ఉన్న చోటికి పరికరం వచ్చి ఎక్స్‌రే తీస్తుంది. దీంతో ఆర్థోరోగి ఎక్స్‌రే ప్లాంట్ వరకు వెళ్లే దూరభారం తగ్గనుంది. సీఆర్ మానిటర్ మంజూరు కాకపోవడంతో ఈసేవల ప్రారంభానికి కొంత సమయం పట్టవచ్చని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. సంబంధితశాఖ జిల్లా అధికారులు స్పందించిత్వరగా పరికరం మంజూరుచేసి డిజిటల్ సేవలు ప్రారంభమయ్యేలా కృషి చేయాలని ఆసుపత్రికి వచ్చేరోగులు కోరుతున్నారు. ఇదిలాఉండగా గత సంవత్సరం కోటిరూపాయలతో నిర్మించిన ఆక్సీజన్ ప్లాంట్‌ను నేటికీ ప్రారంభించలేదు. దీంతో ఉబ్బసంరోగులకు కష్టాలు కలుగుతున్నాయి. అధికారులు, ఆసుపత్రి సలహా సంఘం చైర్మన్, ఎమ్మెల్యే ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు, పేషంట్లు కోరుతున్నారు.

15రోజులుగా తెరుచుకోని ఆధార్ కేంద్రం

సిర్పూర్(టి), జనవరి 25: మండల కేంద్రంలో రెండు నెలలక్రితం తపాలశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కేంద్రం సాంకేతికకారణాలతో మూతపడి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రతకార్డు, ఆధార్ అప్‌డేట్, తదితరాలకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తెలప దంతో ఆధార్‌కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు ఆధార్‌కేంద్రం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై సబ్ పోస్టుమాస్టర్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా 15రోజుల నుంచి ఓఎఫ్ మరమ్మతుల కారణంగా ఆధార్‌కేంద్రం మూతపడి ఉన్న విషయం వాస్తవమేనని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయామని, త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు.



మూత పడి ఉన్న ఆధార్ కేంద్రం

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన విద్యార్థులు

హాజీపూర్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వేంపల్లిలోని ఎస్ఆర్‌కేఎం కాలేజీలో ప్రధాని మోదీ ప్రసంగించిన నమో నవమత్ దాత సమ్మేళన్ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థులు వీక్షించారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ప్రధాని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కో కన్వీనర్ వెంకటేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు బోయిని దేవేందర్, రెడ్డిమల్ల అశోక్, జిల్లా కార్యదర్శి మద్ది సుమన్, సభ్యులు కిశోర్, మహేందర్, వంశీ,మనీష్ పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు జంతు సంక్షేమానికి సహకరించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 25: జంతు సంక్షేమాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేష్‌తో కలిసి జంతుహింస నివారణ సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవుల పట్ల కరుణ కలిగి ఉండాలన్నారు. వీధి కుక్కల పట్ల సానుభూతితో వ్యవ హరించాలని, కుక్క కరిచిన వెంటనే వైద్యులను సంప్రదించి రేబిస్ వ్యాధి టీకాలను వేయించుకోవాలన్నారు. జంతు హింసకు పాల్పడినా, వాటి ఆవాసాలను ధ్వంసం చేసినా, వాటి సంరక్షణకు సేవ చేస్తున్న వారిని అడ్డుకున్నా శిక్షార్హులవుతారన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఎన్నికలు

మందమర్రిటౌన్, జనవరి 25: మందమర్రి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా మందమర్రికి చెందిన కట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో 15 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అసోసియేషన్‌లో 45 మంది ఓటర్లు ఉండగా శ్రీనివాస్‌కు 30 ఓట్లు పోలయ్యాయి. రవీందర్‌కు 15 ఓట్లు పోలయ్యాయి. దీంతో శ్రీనివాస్ విజయం సాధించాడు. ఎన్నికల పరిశీలకులు శంకర్, లక్ష్మణ్, సాంబమూర్తిలు నియామకపత్రం అందించారు.

క్రికెట్ టోర్నమెంట్

హాజీపూర్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపల్లిలో గురువారం ఎంపీటీసీ డేగ బాపు ఆధ్వర్యంలో సామూహిక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు 7 టీంలుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ నిర్వహించి బహుమతులు అందించామని ఎంపీటీసీ బాపు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- జూనియర్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ద్వారా నియామకాలు
- ఏజెన్సీల ఆర్డరు కాపీలతో వెళితే వెనక్కి పంపిన అధికారులు
- లబోదిబోమంటున్న బాధితులు

కాసిపేట, జనవరి 25: నిరుద్యోగుల అవసరాలను ఆసరా చేసుకున్న కొన్ని ఏజెన్సీలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాంజలి 2.0 పోర్టల్ నుంచి ఏజెన్సీ పొందిన కాస్ ఫౌండేషన్, విద్యాదానం ఆర్గనైజేషన్‌లు ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు. రెండు సంస్థల నుంచి ఎంపికైన అభ్యర్థులు వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో జాయిన్ కావడానికి వెళ్లారు. ఒకే పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు రావడంతో ప్రిన్సిపాల్ అయోమయానికి గురయ్యాడు. ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాస్ ఫౌండేషన్ అభ్యర్థులను వెనక్కి పంపడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. బాధితులు మాట్లాడుతూ పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు దం డుకుని ఆర్డరు కాపీలు ఇచ్చినట్లు సమాచారం. ఉద్యోగం కోసం లక్షల రూపాయలు చెల్లించామని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. ఒక్కో ఉద్యోగానికి లక్ష నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఉద్యోగులకు నెలకు రూ.13,700 జీతం ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా మోసపోయినట్లు బాధితులు తెలిపారు.

రెండు ఏజెన్సీల నుంచి నియామక పత్రాలను తీసుకువెళ్లడంతో ప్రిన్సిపాల్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై డీవైఈవో శైలజను వివరణ కోరగా అభ్యర్థులు నియామక పత్రాలతో ఉద్యోగాల్లో చేరడానికి వచ్చింది వాస్తవమే. బోర్డ్‌ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో జాయిన్ చేసుకోలేదు. కొన్ని కాలేజీల్లో విద్యాదానం సంస్థ నుంచి వచ్చిన అభ్యర్థులను జాయిన్ చేసుకున్నట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏసీసీ, జనవరి 25 : ఒలింపియాడ్ నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి 93 మంది విద్యార్థులు లెవెల్ 2కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జోబిన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్లు పొందినట్లు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను డీన్ నాగేశ్వర్‌రావు, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజు, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మందమర్రిరూరల్, జనవరి 25: మందమర్రి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తామని ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో శశికళలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 25: మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం వృద్ధులు, పిల్లల ఆశ్రమాలకు గురువారం మంచిర్యాల బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు బ్రాంచీ మేనేజర్ రమేష్ వోడెల్వార్ సిబ్బంది సహకారంతో నెలకు సరిపడ సరుకులు అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ రెడ్డి, చందూరి మహేందర్, మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, నాగేందర్, బ్యాంకు సిబ్బంది, ఆశ్రమ నిర్వాహకులు సదానందం, తిరుమల పాల్గొన్నారు.

కూలీపై దాడి : పరిస్థితి విషమం

మందమర్రిటౌన్, జనవరి 25 : పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పసునూరి సురేష్ అనే కూలీ బుధవారం రాత్రి తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టుపక్కల వారు గమనించి సురేష్ అక్క స్వర్ణలతకు విషయం తెలియజేయడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సురేష్‌తోపాటు కలిసి ఉంటున్న పోల్ రాజు అనే వ్యక్తి దాడి చేసి ఉంటాడని స్వర్ణలత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వీరిద్దరు విద్యానగర్‌లో నూతనంగా ఇంటి నిర్మాణం చేసి వదిలేసిన ఇంట్లో ఉంటున్నారని పోలీసులు తెలిపారు.

ఎస్‌టీయూ క్యాలెండర్ల విడుదల



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

తాండూర్, జనవరి 25: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను గురువారం రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌లు ఆవిష్కరించారు. ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు విశ్వనాథ్, రవికుమార్, జయశ్రీ, సరోజ, సతీష్,రవి, రాజేశం, రత్నాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) క్యాలెండర్లను కలెక్టర్ బదావత్ సం తోష్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు దుంపల రంజిత్‌కుమార్, చిందం వెంకటేష్, అంజి, పోశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, జనవరి 25: పాత బస్టాండ్ జాతీయ రహదారి వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దీపక్‌నగర్‌కు చెందిన తాపీ మేస్త్రీ అంజనేయులు కుటుంబానికి గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి దర్మయ్య, నాయకులు లింగయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో జోన్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మా ఊరు సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం ఆర్థిక సహాయం అందజేశారు. గణతంత్ర దినోత్సవం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల కోసం సహాయం అందించారు. ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం

మందమర్రిటౌన్, జనవరి 25: తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుపడడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ పథకాలను అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు చూసి తట్టుకోలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్ల రమేష్, మంద తిరుమల్‌రెడ్డి, ఇసాక్‌లు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతుందని, ఇది తెలుసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కోట్ల రూపాయల కుంభకోణాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిందన్నారు. నాయకులు తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. హైద్రాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ బూత్ లెవెల్ సమావేశానికి మందమర్రి నుంచి బస్సుల్లో నాయకులు తరలివెళ్లారు.

ఏసీసీ: హైద్రాబాద్ ఎల్బీనగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి గురువారం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసం నుంచి ప్రత్యేక బస్సుల్లో హైద్రాబాద్ వెళ్లారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మందమర్రిరూరల్, జనవరి 25: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి సారంగపల్లిలో పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువతీ,యువకులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవించడం వల్ల వారి జీవితాలు అంధకారంగా మారుతాయన్నారు. తల్లిదండ్రుల మాటలను వింటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. సర్పంచు ఫర్హీనాసుల్తానా ఫిరోజ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరాం

- ఉద్యమ నేతకు దక్కిన గౌరవం



మంచిర్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కింది. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం అనేక వర్గాలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉంది. నెన్నెల మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని జనార్దన్ రెడ్డి, వెంకటమ్మ దంపతులకు 1955 సెప్టెంబర్ 5న కోదండరాం జన్మించారు. ఆయనకు ఒక సోదరుడు, ఐదు గురు సోదరీమణులు. మార్చి 30న 1983న సుశీలను వివాహం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల కమిటీ, హ్యూమన్ రైట్స్ ఫోరం, సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ, వరల్డ్ సోషల్ ఫోరమ్, తెలంగాణ విద్యావంతుల వేదిక వంటి అనేక ఉద్యమ సంస్థలను స్థాపించి కలిసి పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ)కి నాయకత్వం వహించి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. టీజేఏసీ ద్వారా సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, వంటా వార్పు, సకల జనుల సమ్మె, సాగరహారం, చలో హైదరాబాద్ వంటి కార్యక్రమాలకు టీజేఏసీ బాధ్యత వహించింది. ఆయనకు ఎమ్మెల్సీ పదవి రావడంతో ఉద్యమకారులు, మేధావులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



బంగారు పతకంతో సాహిత్

కాసిపేట, జనవరి 25 : ఈ నెల 21, 22 తేదీల్లో చండీఘడ్‌లో నిర్వహించిన ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కాసిపేటకు చెందిన రడపాక సాహిత్ బంగారు పతకం సాధించాడని కోచ్ రంగు శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి చండీఘడ్‌లో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి తెలంగాణకు వన్నె తెచ్చాడని తెలిపారు. సాహిత్‌ను ఉపాధ్యాయులు, కుటుంబీకులు, స్థానికులు అభినందించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

చెన్నూరు, జనవరి 25 : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ చెన్నూరు యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ప్రైమరీ సభ్యత్వ జాబితాను విడుదల చేశామని ఎన్నికల అధికారి పొన్న మల్లయ్య తెలిపారు. గురువారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ కాంప్లెక్స్‌లో ఈ నెల 28న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే శనివారం మధ్యాహ్నం 2 గంటలలోగా తెలియజేయాలన్నారు. శనివారం సాయంత్రం 3 గంటలకు ఫైనల్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. మామిడి రాజన్న, సత్యనారాయణ, కరీం పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం



ఆసిఫాబాద్‌లో విద్యార్థుల మానవహారం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 25: జాతీయఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాందాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాంకిడి:మండలకేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. దివ్యాంగులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీపీ విమలాబాయి, సర్పంచ్‌తుకారాం, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రయ్య పాల్గొన్నారు.

కెరమెరి: మండలకేంద్రంలో వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షరీఫ్, ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్, ఎఫ్ఆర్వో మజారోద్దీన్, ప్రిన్సిపాల్ పరుశురాం పాల్గొన్నారు.

తిర్యాణి:మండలకేంద్రంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి కుమరంభీం చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్‌సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్, డీటీ వంశీకృష్ణ, సిబ్బంది శ్రీనివాస్, సాయి, భానేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంతోపాటు మారుమూల గ్రామాల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఆర్ఐ వాగ్మారె సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌వద్ద అధికారులు, విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్లు ఎంపీవో మహేందర్ రెడ్డి, ఈవోఆర్‌డీ కృష్ణమూర్తి, ఎస్సై బొజ్జిరావు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలకేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్స్, దివ్యాంగ ఓటర్లు, నవఓటర్లకు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్‌వర్మ, ఎస్సై ప్రవీణ్‌కు మార్, ఎంపీడీవో ప్రసాద్, సర్పంచులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాల: మండలకేంద్రంలో తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధఓటర్లు, వికలాంగులను సన్మానించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రవీందర్, ఎస్సై మధుకర్, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, ఎంఆర్ఐ దిలీప్, ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు పాల్గొన్నారు.

పెంచికలపేట: జడ్పీపాఠశాలవిద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గంగాసింగ్, ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల పాల్గొన్నారు.



కౌటాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



పెంచికలపేటలో..



వాంకిడిలో వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు



జైనూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వన్యప్రాణులను కాపాడడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో పూర్ణచందర్

సిర్పూర్(టి), జనవరి 25: వన్యప్రాణులను కాపాడడం అందరిబాధ్యత అని ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్యప్రాణులను హత మార్చడం చట్టరిత్యా నేరమన్నారు. ఎస్సై దీకొండ రమేష్ మాట్లా డుతూ ఇటీవల వన్యప్రాణుల కోసం విద్యుత్‌తీగలు అమర్చి తమవిలువైన ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. విద్యుత్ తీగలు అమర్చితే వన్యప్రాణుల కన్నా మనకే ఎక్కువ నష్టం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా వాటికి స్వస్తిపలికి వన్యప్రాణులను కాపాడాలన్నారు. అనంతరం 24మంది పశువులు కోల్పోయిన బాధితులకు రూ.5.41 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదలచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏఈ ఇర్ఫాన్‌అహ్మద్, డిప్యూటీరేంజ్ అధికారులు మునవీర్ హుస్సేన్, సద్దాం హుస్సేన్, మండల కోఆప్షన్ సభ్యుడు కీజర్‌హుస్సేన్, సర్పంచ్‌లు ప్రభాకర్, రాజు, అర్జు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి), జనవరి 25: కేంద్రప్రభుత్వం పేదమహిళలకు ఉచితంగా అందజేసే ఉజ్వలగ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్‌వద్ద మండలానికి మంజూరైన 26 ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ ఖుర్షీద్‌హుస్సేన్, బీజేపీ నాయకులు శంకర్, సత్యనారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి

జన్నారం, జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి గెడంసందేశ్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఉపన్యాసపోటీల్లో జన్నారంలోని స్లేట్‌హైస్కూల్‌కు చెందిన ఆదిబాసాహిర్ తృతీయ స్థానంలో నిలిచారు. గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో యాదయ్య షీల్డు, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు కమలాకర్, మురళీ, గోవర్ధనచారి, స్లేట్‌స్కూల్స్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

వేమనపల్లి, జనవరి 25 : వేమనపల్లి సరిహద్దున ప్రవహిస్తున్న ప్రాణహిత నదితీరప్రాంతాల్లో గురువారం సాయంత్రం చెన్నూరు రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలో నక్సలైట్ల ప్రభావం ఉన్నందున వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు అందని గౌరవ వేతనం



- జిల్లాలో రూ.2కోట్ల మేర పెండింగ్
- కొన్ని నెలలుగా అందని వైనం
- ఈ నెలాఖరుతో ముగియనున్న పదవీకాలం
- సత్వరమే వేతనాలు, పనుల బిల్లులు చెల్లించాలంటున్న సర్పంచులు

చింతలమానేపల్లి, జనవరి 25: గ్రామ సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. కానీ వారు కొన్నినెలల వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని 15మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతీ సర్పంచుకు గౌరవవేతనం కింద మొదట్లో రూ.5,000 అందజేయగా వాటికి రూ.1500అదనంగా కలిపి మొత్తం రూ.6,500 అందజేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో రూ.2 కోట్లపైనే సర్పంచ్‌ల వేతన బకాయిలు రావాల్సి ఉన్నది. ఒక్కో సర్పంచుకు రూ.40,000నుంచి 50,000వేల వరకు రావాల్సి ఉన్నది. ఇదేకాకుండా ప్రభుత్వం కొన్నినెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో.. చేసిన ఆ పనుల బిల్లుల కోసం కూడా వారు ఎదురు చూస్తున్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా నిధులు, వేతనాలు వస్తాయని గంపెడాశలు పెట్టుకొని ఎదురు చూస్తు న్నారు. అయితే ఇంకా పదవీకాలం ముగియ డానికి 4,5రోజులే ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలతో పాటు పెండింగ్ నిధులను యుద్ధ ప్రతిపాదికన మంజూరు చేయాలని ఆయాగ్రామాల సర్పంచులు కోరుతున్నారు.

కేటాయించని నిధులు..

గ్రామపంచాయతీల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేస్తున్నప్పటికీ, ఏడాదిగా రాష్ట్ర నిధులు విడుదల కాక సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. 25శాతం పారిశుధ్యానికి, 25శాతం తాగు నీటి అవసరాలకు, మిగతా 50శాతం నిధులు ఇతర పనులకు కేటాయిస్తూ వస్తున్నారు. విద్యుత్ బిల్లులు, మురికి కాల్వల నిర్మాణం, అంతర్గతరోడ్ల నిర్మాణం. పారిశుధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ల బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు చేసిన సర్పం చులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు విడుదల చేయాలి..

జిల్లాలోని ఆయాగ్రామాల్లో స్థానికసర్పంచుల వేతనా లతోపాటు వారుచేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర నిధులు రాక అప్పులు చేశామని వాపోతున్నారు. అప్పులు చేసి పన్నులు చెల్లించడంతో తీవ్రఇబ్బందుల పాలవుతున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొంటున్నారు.


గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్డు

పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలి..

జటోత్ సోమేష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, చింతలమానేపల్లి



కొన్ని నెలలుగా జీపీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో సర్పంచులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చాలాగ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా.. ఇప్పటికీ బిల్లులు రాలేదు. వెంటనే ప్రభుత్వం స్పం దించి తక్షణమే పెండింగ్ బిల్లుల విడదలతోపాటు వేతనాలు అందజేయాలి. సర్పంచులను ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడాలి.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్



పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ హేమంత్ బొర్కడే

ఆసిఫాబాద్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ తమిళసై సౌందర రాజన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే అవార్డు అందుకున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన శాసన సభ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు 14వ జాతీయ ఓటరుదినోత్సవంపై జిల్లావ్యాప్తంగా ప్రజలందరికీ అవగాహన కల్పించేలా విస్తృతమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను ఈ పురస్కారాన్ని అందించారు.

ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


ఆసిఫాబాద్‌లో ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్‌లు దీపక్‌తివారి, వేణు

ఆసిఫాబాద్, జనవరి 25: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జాతీయ ఓటరుదినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ నుంచి పిల్లల పార్కు, కుమరంభీం చౌరస్తా మీదుగా తిరిగి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీలో అదనపుకలెక్టర్ వేణు, డీఆర్వో సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, విద్యార్థులు, సిబ్బంది, ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతరాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఎన్నికల్లో అర్హతగల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కువినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకుని దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులు, నూతన ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు

గ్రంథాలయాల అభివృద్ధి ద్వారా పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని పోటీపరీక్షలకు సిద్ధమై ప్రభుత్వకొలువులు సాధించి తల్లిదండ్రులకు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

గంగాజలం కోసం తరలివెళ్లిన మెస్రం వంశీయులు

జైనూర్, జనవరి 24: ఆదివాసుల కొంగుబంగారం కేస్లాపూర్‌లోని నాగోబా దేవతా పూజల కోసం పవిత్రమైన గంగాజలం కోసం మేస్రం వంశీయులు గురువారం జైనూర్ మండలంలోని గౌరి నుంచి జైనూర్ మీదుగా సిర్పూర్(యు) మండలానికి బయలు దేరారు. బుధవారం రాత్రి గౌరిలో బసచేసిన మేస్రాం వంశీయులకు గౌరి, దబోలి గ్రామాల మేస్రం వంశీయులు తొలుత సాదరంగా స్వాగతం పలికి వారికి సకల మర్యాదలు చేశారు. అదేవిధంగా ఉదయం మేస్రం వంశీయులకు మర్యాదపూర్వకంగా సత్యనిష్ఠతో పాదాభి వందనలు చేసి సాగనంపారు.

తుడుందెబ్బ మండల కమిటీ

తిర్యాణి, జనవరి 25: మండల తుడుందెబ్బ కమిటీని ఆ సంఘం జిల్లాఅధ్యక్షుడు కోవవిజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గణపతి, అధ్యక్షుడిగా భాస్కర్, ప్రధానకార్యదర్శిగా వినోద్, ఉపాధ్యక్షులుగా జంగు, అంబారావు, వెంకటేష్, సహాయ కార్యదర్శిగా సోనేరావు, ప్రచార కార్యదర్శిగా ధన్వంత్‌రావు, సాంస్కృతికకార్యదర్శిగా గంగరాంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, భగవంతరావు, ధర్ము, గోపాల్, శ్రీధర్, శ్రీరాములు, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కోవలక్ష్మి

వాంకిడి, జనవరి 25: గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని జైహూర్ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలపారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆమెవెంట జడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి, సహకార ఛైర్మన్ పెంటు, సర్పంచ్ రేణుక, ఎంపీడీవో శివకుమార్, ఏఈ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రమైన జంగుబాయి క్షేత్రం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ సోయంబాపూరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి


జంగుబాయి క్షేత్రానికి కుటుంబ సమేతంగా వస్తున్న ఎంపీ సోయంబాపూరావు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


పాల్గొన్న జంగుబాయి దీక్షాపరులు

కెరమెరి, జనవరి 25: ప్రతియేటా పుష్యమాసంలో ప్రారంభమై నెలరోజులపాటు జరిగే జంగుబాయి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భారీగా జంగుబాయి దీక్షాపరులు ముక్దంగూడ అడవిలో కొలువైన తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకొవటానికి భారీగా తరలివచ్చారు. కార్యక్రమానికి ఎంపీ సోయంబాపూరావు కుటుంబసమేతంగా హాజరై దీక్ష స్వీకరించారు. జంగుబాయి గుహలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్లాడుతూ కేంద్రప్రభుత్వ నిధులతో తమ ఆరాధ్యదైవాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే కప్లై దేవతను సందర్శించి గుహలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శంకర్‌లొద్ది శివలింగాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అక్కడికి వచ్చిన వేలాది మంది జంగుబాయి దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పూజలు చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి..

గిరిజనుల ఆరాధ్యదైవం 8గోత్రాల ఆడబిడ్డ జంగుబాయి క్షేత్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూజంగుబాయి ఆలయాభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొస్తానని తెలిపారు. ఆమెవెంట ఎంపీపీ మోతీరాం, వైస్‌ఎంపీపీ కలాం, కమిటీ ఛైర్మన్ జాకు తదితరులున్నారు.



కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

వాంకిడి, జనవరి 25: వాంకిడి పోలీసుస్టేషన్‌లో గురువారం కేవీపీఎస్ క్యాలెండర్‌ను సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారం కోసం కేవీపీఎస్ నాయకులు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, కార్తీక్, ఉత్తం, కానిస్టేబుల్ గణేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉంటాం: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

దహెగాం, జనవరి 25: ప్రజలకు సేవ చేయడానికి పోలీసులు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటారని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని లోహ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా దహెగాం పోలీసుల ఆధ్వర్యంలో దుప్పట్లు, పంచెలు, చీరలు, వాలీబాల్‌కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల అటవీప్రాంత గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దన్నారు. వారితోగ్రామాలు ఎక్కడా అభివృద్ధి చెందలేదన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు రవాణా, విద్య, పెన్షన్లు పలు సంక్షేమపథకాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యుత్‌తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిసాగు, విద్యుత్‌తీగలు అమరిస్తే పోలీసులకు సమాచారం అందించినట్లయితే వారికి తగిన పారితోషికం అందిస్తామని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నిత్యావసర సరుకులు, దుప్పట్లు, పంచెలు, చీరలు, యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్, మంచిర్యాల సామాజిక చారిటబుల్‌ట్రస్ట్ సభ్యులు సరిత, వైస్‌ఎంపీపీ సురేష్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ

ఆసిఫాబాద్ రూరల్, జనవవరి 25: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీపీ మల్లికార్జున్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకసమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, స్థానికఅధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అయిదేళ్లపాలనలో ఆసిఫాబాద్ మండలంలో పలుగ్రామాలు సమస్యలను పరిష్కరించడంలో ముందువరుసలో ఉన్నాయని కొనియాడారు. కాంగ్రెస్‌ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరుగ్యా రంటీల్లో భాగంగా కొత్త రేషన్‌కార్డులు, విద్యుత్‌బిల్లులపై ఎటువంటి విధివిధానాలు రాలేదని సంబంధితశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సర్పంచ్‌లను సన్మానించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రమేష్, సహకారఛైర్మన్ అలీబీన్ అహ్మద్, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 25: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన జిల్లాకేంద్రంలోని పొట్టి శ్రీరాములుచౌక్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత అశోక్ ఇంట్లో మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్న గోల్డ్‌స్మిత్ సత్యనారాయణ ప్రతిరోజు లాగే మొదటిరూంలో నిద్రిస్తుండగా ఉదయం నాలుగుగంటల ప్రాంతంలో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. మళ్లీ వచ్చింది. రోజులాగే ఉదయంలేచి చూడగానే వంటరూంలో పెద్దఎత్తున పొగ ఉండడంతో గుర్తించివెంటనే అగ్రిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. సిబ్బందివచ్చేసరికి ఇల్లు అగ్నికి ఆహుతయింది. దీంతో 20గ్రాముల బంగారం, కిలో వెండి, మూడులక్షల నగదుతోపాటు బీరువాప్రిడ్జి కాలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు ఏడులక్షల వరకు నష్టం వాటిల్లిందని తనను ఆదుకోవాలని కోరాడు. రెవెన్యూసిబ్బంది పంచనామా నిర్వహించారు.

తహసీల్దార్‌కు సన్మానం

కెరమెరి, జనవరి 25: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మాలిసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మునావర్‌షరీఫ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తులసీరాం, నారాయణ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

బెజ్జూరు, జనవరి 25: మండల పరిషత్‌లో పాఠశాలల గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు శ్రీనాథ్, శ్రీనివాస్, యాకూబ్, సమ్మయ్య, జమీల్, కపిల్, ఆశాజ్యోతి, సంతోష్, ఫణేష్, జావీద్, తిరుపతి, అరుణ్, కల్యాణ్, అంజన్న పాల్గొన్నారు.





ఓటు హక్కును నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే హరీష్‌బాబు


దహెగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, జనవరి 25: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యత అని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అంగడిబజార్ ఏరియాలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు జాతీయఓటరు దినోత్సవం సందర్భంగా మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుహక్కు కీలకమైనదని అన్నారు. అలాగే పీపీరావుకాలనీలో మాజీఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు స్మారకక్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపులో పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధనుంజయ్, ఎంపీటీసీ జయలక్ష్మి, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సత్యనారాయణ, దామోదర్, ప్రభాకర్‌గౌడ్, సంజీవ్, మల్లేష్, సురేష్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి


ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 25: తునికాకు టెండర్లు అయ్యేలా చూడాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తునికాకు కల్లేదారుల సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ సంఘం అధ్యక్షుడు కాశీనాథ్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం తరువాత తునికాకు సేకరణ రెండో పంటగా ఉందన్నారు. ఆకుసేకరణ ద్వారా 30వేలమంది లబ్ధిపొందు తున్నార న్నారు. జిల్లాలోని అటవీశాఖ అధికారులు పులులు సంచరిస్తున్నాయనే పేరుతో ఈ సంవత్సరం ఆకు సేకరణ నిలిపివేయాల్సిం దిగా సిఫారసు చేస్తూ ప్రభు త్వానికి నివేదికలు పంపించా రన్నారు. ఈ ఏడాది తునికాకు సేకరణ జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, తిరుపతి, హనుమంతు, అజీజ్, తిరుపతి, రవి, లక్ష్మణ్, సంతోష్, మంగయ్య, నగేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో గ్రామ కోఆప్షన్ సభ్యుడు మృతి

సిర్పూర్(టి), జనవరి 25: సిర్పూర్(టి) కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఆశిక్‌హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీఛైర్మన్ కోనేరు కృష్ణారావు హుస్సేన్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనవెంట ఈవో కృష్ణమూర్తి ఉన్నారు.



